
ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

నేడు మార్కెట్ కమిటీ పాలకవర్గం ప్రమాణస్వీకారం

● హాజరుకానున్న పలువురు మంత్రులు

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణస్వీకార కార్యక్రమం శనివారం బాటసింగారం పండ్ల మార్కెట్‌లో ఏర్పాటు చేసినట్లు మార్కెట్ కమిటీ సెక్రెటరీ శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 12.10 నిమిషాలకు నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరారవు, ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు, రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పంచాయతీ రాజ్ శాఖమంత్రి సీతక్క, శాసన మండలి విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీలు యెగ్గె మల్లేష్, దాయానంద్‌గుప్త, మదు యాష్కీగౌడ్, కిచ్చెనగారి లక్ష్మారెడ్డి, మల్‌రెడ్డి రాంరెడ్డి పరమేశ్వర్‌రెడ్డి, కోదండరెడ్డితో పాటు పలువురు నేతలు పాల్గొననున్నారు. ప్రమాణస్వీకార సభ ఏర్పాట్లను మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మదుసూధన్‌రెడ్డి ఆయన అనుచరులతో దగ్గరుండి పర్యవేక్షించారు.

సహోద్యోగినిపై లైంగిక దాడి.. బౌన్సర్‌పై కేసు

కొత్తపేట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇద్దరూ హోటల్‌లో పని చేస్తున్నారు. ఆమె సీనియర్ కెప్టెన్ అతడు బౌన్సర్. ఆమెతో పరిచయమైన కొన్నాళ్లకు అతడు ప్రేమిస్తున్నానని పెళ్లి చేసుకుంటాననీ మాయమాటలు చెప్పి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఎల్‌బీనగర్ ఎస్‌హెచ్‌ఓ కే వినోద్‌కుమార్ వివరాల ప్రకారం.. మేడ్చల్ మల్కాజిగిరి అల్వాల్‌కు చెందిన సాయికుమార్ (26) ఎల్‌బీనగర్ పరిధిలోని ఓ హోటల్‌లో బౌన్సర్‌గా పనిచేస్తున్నాడు. 2022లో అతడికి అదే హోటల్‌లో సీనియర్ కెప్టెన్‌గా పనిచేసే యువతి పరిచయమయింది. పెళ్లి చేసుకుంటాననీ ఆమెను ఒప్పించి, ఓయో రూమ్‌లో ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆమె అతడి తల్లిదండ్రులకు చెప్పడంతో ఈ యేడాది ఏప్రిల్ లో వారికి ఎంగేజ్‌మెంట్ చేశారు. తర్వాత పెళ్లి చేసుకుందామంటే పెళ్లికి నిరాకరిస్తూ ఆమెపై దాడి చేశాడు. బాధితురాలు ఈ నెల 3వ తేదీ రాత్రి అతడిపై ఎల్‌బీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగం వచ్చిందని ఫార్మసీ విద్యార్థినికి ఫోన్‌చేసి..

రూ. 1,43,500 దోచుకున్న సైబర్ నేరగాళ్లు

కొత్తపేట, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఫార్మసీ విద్యార్థినికి ఫోన్ చేసి పార్ట్ టైం ఉద్యోగం వచ్చిందని సైబర్ నేరస్థుడు మాయమాటలు చెప్పి రూ.1,43,500 దోచుకున్న సంఘటన ఎల్బీనగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌హెచ్‌ఓ వినోద్ కుమార్ వివరాల ప్రకారం.. ఎల్బీనగర్‌లో ఉండే వైష్ణవి(21) ఫార్మసీ విద్యార్థిని. ఉద్యోగ ప్రయత్నంలో భాగంగా సెప్టెంబర్ 3వ వారంలో ఆమె నౌకరీ యాప్‌లో తన వివరాలతో ప్రొఫైల్ అప్ లోడ్ చేరింది. సమాచారం అందుకున్న సైబర్ నేరస్థుడు వెంటనే ఆమెకు కాల్ చేసి పార్ట్ టైం జాబ్ వచ్చిందని నమ్మబలికాడు. జీతం కోసం బ్యాంకు ఖాతా వివరాలు పంపమనగా, ఆమె తన ఎస్బీఐ ఖాతా వివరాలు పంపింది. మొదట తమకు డబ్బు బదిలీ చేయాలని అతడు ఆమెకు మోసపూరిత యూపీఐ ఐడీ పంపాడు. అది స్కామ్ అని గుర్తించక ఆమె తల్లికి సమాచారం అందజేసి, ఆమె ఖాతా నుంచి డబ్బు తన బ్యాంకు ఖాతాకు బదిలీ చేయించుకుంది. వైష్ణవి తన ఖాతా నుంచి విడతలుగా జీపే ద్వారా రూ. 1,43,500 అతడికి బదిలీ చేసింది. తర్వాత అతడి నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో తను మోసపోయినట్లు గ్రహించి శుక్రవారం ఎల్బీనగర్ పీఎస్ లో ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తులో ఉంది.

ఉత్పత్తులు ప్రజల అభిరుచులకు అనుగుణంగా ఉండాలి


ఈషా శారీస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ చింతల అరుణాసురేందర్

మన్సూరాబాద్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): ఉత్పత్తులు ప్రజల అభిరుచులకు అనుగుణంగా ఉన్నప్పుడే వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయని నాగోల్ కార్పొరేటర్ చింతల అరుణాసురేందర్ యాదవ్ పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని మమతానగర్ రోడ్ నంబర్.3లో నూతనంగా ఏర్పాటు చేసిన ఈషా వెడ్డింగ్ శారీస్ సెంటర్‌ను నిర్వాహకుడు ఆర్.చెన్నకేశవులుతో శుక్రవారం ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సిద్దాల ఐలయ్య రావుల శ్రీనివాస్, నరేందర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

సింగరేణి గుడిసెల ప్రాంతంలో మూడు బోర్లు

సైదాబాద్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): సింగరేణిగుడిసెవాసులు నీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని ఐఎస్‌సదన్ కార్పొరేటర్ జంగం శ్వేతా రెడ్డి అన్నారు. శుక్రవారం కార్పొరేటర్ సొంత నిధులతో సింగరేణి గుడిసెలలో మూడు బోర్లను వేయించారు. కార్యక్రమంలో భాగ్యనగర్ జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు జంగం మధుకర్ రెడ్డి, స్థానికులు రవి, ధర్మి, భీమ్లా, నర్సింహ్మగోపాల్ పాల్గొన్నారు.


బోర్‌వెల్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ జంగం శ్వేతారెడ్డి

ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఓపెన్ జిమ్

మన్సూరాబాద్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని వారు నిత్యం వ్యాయామం చేసుకుని ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు వీలుగా ఓపెన్ జిమ్ సౌకర్యం కల్పిస్తున్నట్లు మన్సూరాబాద్ కార్పొరేటర్, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహా రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు డివిజన్ పరిధిలోని పెద్ద చెరువు ప్రాంగణం, చంద్రపురి కాలనీలో ఓపెన్ జిమ్ పరికరాలు ఏర్పాటు చేసేందుకు స్థలాలను శుక్రవారం జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ స్వప్న, డబ్ల్యూఐ సీతారాం, బీజేపీ నాయకులు పన్నాల చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


ఇంజనీరింగ్ అధికారులతో కలిసి స్థలాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ నర్సింహా రెడ్డి

వాహెద్‌నగర్‌లో ఫ్యామిలీ డిజిటల్ కార్డుల సర్వే


వాహెద్‌నగర్‌లో డిజిటల్ కార్డుల కోసం ఇంటింటి సర్వే చేస్తున్న సిబ్బంది

ఓల్డ్‌మలక్‌పేట అక్టోబరు4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం రేషన్. ఆరోగ్య కార్డుల స్థానంలో సంక్షేమ పథకాల అమలుకు నూతనంగా ఫ్యామిలీ డిజిటల్ కార్డులు ప్రవేశపెట్టనుంది. ప్రతి ఇంట్లో కుటుంబసభ్యుల వివరాలు సేకరించి నమోదు చేయనున్నారు. పైలెట్ ప్రాజెక్టులో భాగంగా ఓల్డ్‌మలక్‌పేట డివిజన్ వాహెద్‌నగర్‌లో శుక్రవారం నుంచి రెవెన్యూ, జీహెచ్‌ఎంసి సిబ్బంది కో ఆర్డినేషన్‌లో డిజిటల్ సర్వే పారంభించారు. ఆయా కుటుంబాల్లో పుట్టిన, మరణించిన వారి వివరాలు, ఇలా ప్రతీ కటుంబసభ్యుడి పూర్తి వివరాలు పక్కాగా సేకరించి డిజిటల్ యాప్‌లో నమోదుచేస్తున్నారు. డిజిటల్ సర్వే ఈ నెల 8వ తేదీ వరకు కొనసాగనున్నట్లు అధికారులు తెలిపారు.



దసరాను పురస్కరించుకుని రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు చిలుక మధుర ఉపేందర్‌రెడ్డి దంపతులు ఆర్‌కేపురం డివిజన్ పరిధిలోని ఆలయాలు, పార్కులలో పనిచేసే సిబ్బందికి, జీహెచ్‌ఎంసీ పారిశుధ్య కార్మికులకు వాసవీకాలనీలో శుక్రవారం చీరలు పంపిణీ చేశారు.

-ఎల్బీనగర్, (ఆంధ్రజ్యోతి)

వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

● గాయత్రీ మాత అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారు


దుర్గా రాజరాజేశ్వరీ దేవికి ప్రత్యేక పూజలు చేస్తున్న కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మిరెడ్డి


ప్రత్యంగిరా పరమేశ్వరి మాతను దర్శించుకున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, చిలుక ఉపేందర్‌రెడ్డి తదితరులు


విజయదుర్గామాతను దర్శించుకున్న నగర మాజీడిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ

ఎల్‌బీనగర్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను భక్తులు వాడవాడలా భక్తిపారవశ్యంతో నిర్వహిస్తున్నారు. శుక్రవారం శ్రీ గాయత్రీ మాత అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజాధికాలు నిర్వహిస్తున్నారు. ఆర్‌కేపురంలోని వారాహీ శ్రీ ప్రత్యంగిరా అమ్మవారి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ప్రత్యంగిరా పరమేశ్వరి మాతను దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ కార్యదర్శి మునిపల్లె శ్రీనివాస్ స్వాగతం పలికి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చిలుక ఉపేందర్ రెడ్డి, ఆర్‌కేపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న గణేష్ నేత, గట్ల రవీంద్ర రాము, ఎన్‌ఎస్‌యూఐ శివ, విఠల్‌శర్మ, హేమంత్‌శర్మతదితరులు పాల్గొన్నారు.

సైదాబాద్ : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు సైదాబాద్, మాదన్నపేట, మలక్‌పేటలో భక్తి పారవశ్యంతో జరుగుతున్నాయి. రెండవ రోజు సైదాబాద్ మాత మైదానంలోని శ్రీ విజయదుర్గమాతను బాలత్రిపుర సుందరిగా, జీవన జ్యోతి సంఘంలోని శ్రీ జయదుర్గాదేవి గాయత్రీ దేవి అలంకారంతో దర్శనమిచ్చారు.

చంపాపేట: చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని శ్రీ హనుమాన్ దేవస్థానంలో శుక్రవారం శ్రీ సరస్వతిదేవి అమ్మవారు గాయత్రీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పూజా కార్యక్రమంలో ఆలయ ఇన్‌చార్జి ఈఓ ప్రేమ్‌కుమార్‌రావు, వేద పండితులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

వనస్థలిపురం: వనస్థలిపురంలోని ప్రసిద్ధ ఎల్మమ్మ దేవి ఆలయంలో రెండవ రోజు ఎల్లమ్మ దేవి అమ్మవారు శ్రీ బాలా త్రిపురసుందరీ దేవి అవతారంలో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వనపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షులు మాలె రాంరెడ్డి, డొక్క సత్యానారాయణ పాల్గొన్నారు.

చాదర్‌ఘాట్: శ్రీదుర్గా రాజరాజేశ్వరీ అమ్మవారు శ్రీగాయత్రీ దేవీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా మహిళలు సామూహిక లక్ష పుష్పార్చన పూజా కార్యక్రమాన్ని నిర్వహించగా మూసారాంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ జూకంటి యాదగిరి, ప్రధాన కార్యదర్శి కాటపల్లి రాజేశ్వరరావు, కోశాధికారి ఆకుల విష్ణువర్ధన్ యాదవ్, కాసుల జంగయ్య గౌడ్, ఉపాధ్యక్షులు బద్దం జంగారెడ్డి, సంయుక్త కార్యదర్శి బద్దం శ్రీనివాస్‌రెడ్డితో కూడిన బృందం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

విద్యార్థులు పోటీ ప్రపంచంలో దూసుకెళ్లాలి

● తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ లింబాద్రి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉన్నత విద్యామండలి చైర్మన్ లింబాద్రి

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): పోటీ ప్రపంచంలో అవకాశాలను అందిపుచ్చుకుంటూ ముందుకెళ్లాలని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ లింబాద్రి అన్నారు. నగర శివారు అబ్దుల్లాపూర్‌మెట్ మండలం గుంతపల్లిలోని అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ఫ్రెషర్స్ డే పార్టీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎలిప్ వైస్‌ప్రెసిడెంట్ త్రిపురాంభ, టీహబ్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌తాలుక, కళాశాల చైర్మన్ శ్రీనివాసరావుతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యా మండలి చైర్మన్ మాట్లాడుతూ తమపై నమ్మకం పెట్టుకున్న తల్లిదండ్రుల కలలను సాకారం చేయాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. డ్రగ్స్‌కు విద్యార్థులు దూరంగా ఉండాలని జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ఉద్యోగ నైపుణ్యత కోసం ప్రభుత్వం స్కిల్స్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ శ్రీనివాస్‌రావు, కళాశాల జనరల్ సెక్రెటరీ డాక్టర్ ప్రియాంక, మేనేజింగ్ డైరెక్టర్ శ్రావణ్ కుమార్, డైరెక్టర్ డాక్టర్ జయప్రద, ప్రిన్సిపల్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

పేదలకు సీఎం 'రిలీఫ్' ఫండ్: ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్‌తో ఎంతో మంది పేదలకు లబ్ధి చేకూరుతున్నదని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి చెప్పారు. నియోజకవర్గం పరిధిలోని పలు డివిజన్లకు చెందిన లబ్ధిదారులకు శుక్రవారం ఆయన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారు ఆసుపత్రుల్లో చికిత్స పొంది ఆర్థిక ఆసరా కోసం సంప్రదించగా వారి వివరాలతో ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో నాయకులు సదానంద్‌రెడ్డి, జగదీష్‌యాదవ్, భైర శంకర్, పండాల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

'తెలంగాణ ఉద్యమానికి దిక్సూచి ఇంద్రన్న'

సరూర్‌నగర్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): తొలిదశ తెలంగాణ ఉద్యమ జ్ఞాపకాలు మరుగున పడిపోయిన సమయంలో ఉమ్మడి రాష్ట్ర మాజీ హోంమంత్రి దివంగత పి.ఇంద్రారెడ్డి మలిదశ ఉద్యమానికి శ్రీకారం చుట్టి దిక్సూచిలా నిలిచారని బీఆర్‌ఎస్ బడంగ్‌పేట్ కార్పొరేషన్ శాఖ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి అన్నారు. శుక్రవారం బడంగ్‌పేట్‌లోని పాత గ్రామ పంచాయతీ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇంద్రారెడ్డి ఫ్లెక్సీకి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. పాలమాకులలో ఇంద్రారెడ్డి విగ్రహం వద్ద నిర్వహించిన జయంతి వేడుకల్లో ఆయన తనయుడు పి.కార్తీక్‌రెడ్డి నివాళులర్పించగా, మీర్‌పేట్‌కు చెందిన బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు జిల్లా సౌందర్యావిజయ్, మాదరి సురేఖారమేశ్, అనిల్‌గౌడ్, శ్యామ్ పాల్గొన్నారు.

కౌకుంట్లలో... మాజీ హోంత్రి స్వర్గీయ పట్లోళ్ల ఇంద్రారెడ్డి జయంతిని పురస్కరించుకుని ఆర్‌కేపురం, సరూర్‌నగర్ డివిజన్ బీఆర్‌ఎస్ నాయకులు ఎమ్మెల్యే సబితారెడ్డితో కలిసి కౌకుంట్లలోని ఇంద్రారెడ్డి సమాధి వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం బీఆర్‌ఎస్ యూత్ వింగ్ మాజీ అధ్యక్షుడు లోకసాని కొండల్ రెడ్డి, ఆర్‌కేపురం డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు నగేశ్ ఉన్నారు.

కాకా జయంతిని ఘనంగా నిర్వహించాలి

● తెలంగాణ మాల సంఘాల జేఏసీ చైర్మన్ బేర బాలన్న

దిల్‌సుఖ్‌నగర్, అక్టోబరు4(ఆంధ్రజ్యోతి): కేంద్ర కార్మిక శాఖ మాజీ మంత్రి కె.వెంకటస్వామి 95వ జయంతి వేడుకలను తెలంగాణ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని తెలంగాణ మాల సంఘాల జేఏసీ వర్కింగ్ చైర్మన్ బేర బాలకిషన్ పిలుపునిచ్చారు. శుక్రవారం దిల్‌సుఖ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం నేతలతో కలిసి జయంతి వేడుకల ఏర్పాట్లు చర్చించారు. ఈ సమావేశంలో తెలంగాణ మాల సంఘాల జేఏసీ చైర్మన్ జి.చెన్నయ్య, మేక వెంకన్న, బూర్గుల వెంకటేశ్వర్లు, గోపోజు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రామ రామ రామ ఉయ్యాలో..

దిల్‌సుఖ్‌నగర్, ఎల్‌బీనగర్ జోన్ బృందం, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): మలక్‌పేటలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో జరిగిన బతుకమ్మ వేడుకల్లో కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్ రెడ్డి, విద్యార్థినులు, అధ్యాపకులు కలిసి బతుకమ్మ ఆడారు. రంగారెడ్డి జిల్లా కోర్టుల ఆవరణలో, దిల్‌సుఖ్‌నగర్ సాయి చైతన్య జూనియర్ కళాశాలలో బతుకమ్మ నిర్వహించారు.


రంగారెడ్డి జిల్లా కోర్టుల ఆవరణలో బతుకమ్మ సంబరాలలో పీపీలు, మహిళా న్యాయవాదులు


మలక్‌పేట ప్రభుత్వ కళాశాలలో బతుకమ్మ సంబరాల్లో కార్పొరేటర్ కొత్తకాపు అరుణ, లెక్చరర్లు

దసరా కోసం దూరప్రాంతాలకు ప్రత్యేక బస్సులు

చంపాపేట, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): దసరా పండుగను పురస్కరించుకొని వివిధ దూరప్రాంతాలకు వెళ్లేందుకు ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు కంచన్‌బాగ్ మిధాని సీఏసీలోని హయత్‌నగర్ డివిజన్ ఆర్టీసీ డిప్యూటీ రీజినల్ మేనేజర్ (ఆపరేషన్స్) వి.సుచరిత శుక్రవారం తెలిపారు. ఈ నెల 5నుంచి 12వరకు యంజీబీఎస్, దిల్‌సుఖ్‌నగర్, ఎల్‌బీనగర్, సంతోష్‌నగర్, ఉప్పల్ ప్రాంతాల నుంచి విజయవాడ, కోదాడ, సూర్యాపేట, నల్గొండ, మిర్యాలగూడ, ఖమ్మం, ఆమనగల్లు, కల్వకుర్తి, చింతపల్లి, మాల్, వరంగల్, హన్మకొండ, భువనగిరి తదితర ప్రాంతాలకు బస్సులను నడుపుతున్నట్లు డీఆర్‌ఎం తెలిపారు.

మహేశ్వరంలో తిరుగులేని శక్తిగా బీజేపీ

● చేవెళ్ల ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి


నాదర్‌గుల్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి, శ్రీరాములు యాదవ్

సరూర్‌నగర్, అక్టోబరు 4(ఆంధ్రజ్యోతి): మహేశ్వరం నియోజకర్గంలో బీజేపీ తిరుగులేని శక్తిగా అవతరించిందని, భవిష్యత్‌లో ఇక్కడ ఏ ఎన్నికలు జరిగినా కాషాయ జెండా రెపరెపలాడడం ఖాయమని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్ 8వ డివిజన్ అంబేడ్కర్ నగర్ తదితర ప్రాంతాల్లో గురువారం రాత్రి నిర్వహించిన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములుయాదవ్, కార్పొరేటర్ గూడెపు ఇంద్రసేనతో కలిసి ఆయన ప్రారంభించారు. పలువురితో పార్టీ సభ్యత్వం చేయించి రసీదులు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహేశ్వరం నియోజకవర్గం కన్వీనర్ దేవేందర్‌రెడ్డి, కౌన్సిల్ బీజేపీ ఫ్లోర్ లీడర్ తోట శ్రీధర్‌రెడ్డి, కార్పొరేటర్లు రామోజీ అమితాశ్రీశైలంచారి, నిమ్మల సునీతాశ్రీకాంత్‌గౌడ్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్లలోకి వెళ్లేందుకు 31 కుటుంబాలు సిద్ధం

● కొత్తగా మార్కింగ్‌పై స్థానికుల అభ్యంతరం

● వాటిని కూల్చేందుకేనంటున్న రెవెన్యూ అధికారులు


సాయిలు హట్స్‌లో కుటుంబీకులతో వాగ్వాదానికి దిగిన ఇతర వ్యక్తులు

చాదర్‌ఘాట్, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): మూసారాంబాగ్ డివిజన్ సాయిలు హట్స్‌లో కొత్తగా మార్కింగ్ చేసిన ఇళ్లపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు. మార్కింగ్ చేసిన ఇళ్లకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు పూర్తికాకముందే కొత్తగా మరికొన్ని ఇళ్లకు ఎలా మార్కింగ్ చేస్తారంటూ ప్రశ్నిస్తున్నారు. మూసారాంబాగ్ డివిజన్‌లోని తీగలగూడ, శాలివాహననగర్, సాయిలు హట్స్‌లో 84 ఇళ్లు మూసీ గర్భంలో ఉన్నట్లు గుర్తించిన విషయం తెలిసిందే. శాలివాహననగర్‌లో 30 కుటుంబాలు ఉప్పల్‌లోని ప్రతాప్‌సింగారం వెళ్లేందుకు సంసిద్ధత వ్యక్తం చేయగా.. శుక్రవారం సాయిలు హట్స్‌లో 13 కుటుంబాలు, శాలివాహననగర్ నుంచి 18 కుటుంబాలు జియాగూడలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. సాయిలు హట్స్‌లో మరికొన్ని ఇళ్లకు మార్కింగ్ చేసిన విషయాన్ని స్థానికులు గమనించి అభ్యంతరం తెలిపారు. దీంతో అక్కడ నివసిస్తున్న వారికి పక్క ప్రాంతంలో నివసిస్తున్న కుటుంబీకుల మధ్య వివాదం తలెత్తింది. మూసీకి దూరంగా ఇళ్లకు ఎలా మార్కింగ్ చేశారని పలువురు స్పెషల్ ఆఫీసర్ రాజేష్, సైదాబాద్ మండలం తహసీల్దార్ జయశ్రీని నిలదీశారు. ఆ ఇళ్లను కూల్చేందుకు మార్కింగ్ చేశామని, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించడానికి కాదంటూ తహసీల్దార్ అన్నారు. డిజిటల్ సర్వే ఆధారంగానే ఇళ్ల మార్కింగ్ జరిగిందన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం మార్కింగ్ చేసినట్లు సర్వేలో తేలితే క్రిమినల్ కేసు నమోదు చేస్తామని స్పెషల్ ఆఫీసర్ రాజేష్ స్పష్టం చేశారు. శనివారం సాయంత్రం వరకు సాయిలు హట్స్‌లో మార్కింగ్ చేసిన ఇళ్లలోని కుటుంబీకుల్లో ఎక్కువ మంది జియాగూడలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలోకి వెళ్లేందుకు సిద్ధమైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. వారిని తరలించేందుకు ఏర్పాట్లు చేస్తామని తహసీల్దార్ జయశ్రీ తెలిపారు.